

# కథా కౌముది

## స్వీకారం - అరుణ నిష్టల

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

"కలా? నిజమా?" అనిపించేటట్లు జరిగిన ఆ సంఘటనల ప్రవాహంలో ఆధారం లేనివాడిలా కొట్టుకుపోయాడు రమణారావు. దాదాపు నలభై ఏళ్ళ వివాహ బంధాన్ని నిద్దురలోనే తెంచేసుకుని అనంత లోకాలకు పయనమైపోయిన కమల ఇక లేదన్న సత్యం అతడిని ఆమూలాగ్రమూ కుదిపివేసింది.

పి.ఎస్.యూ.లో డైరక్టర్ పదవి నిర్వహించి రిటైర్ అయిన రమణారావు బాల్యంలో గారాబంగానూ యౌవనంలో పూచీ లేకుండాను పెరిగి, "వాడు మగపిల్లాడూ" అంటూ ఆడపిల్లల హోదా తగ్గించి అహంకారంగా పెంచిన తల్లి పెంపకంలో, జీవితంలో సున్నితమైన విషయాలకు భావాలకి విలువ నివ్వడం అంటే ఏమిటో తెలీకుండా పెరిగాడు.

"వాడికేం? మహారాజు" అంటూ ఏ పని చేసినా 'మనకేమిటి అందులో లాభం' అనే తండ్రి లౌక్యపు పెంపకంలో - వానలో నీటికి కొట్టుకుపోతూ అవస్థలు పడే చీమను కొబ్బరిపుల్లతో ఒడ్డుకు చేర్చే చిన్నాన్నగారి అమ్మాయిలా - గుండెల్లో మిగతా వారి గురించి కూడా ఆలోచించవచ్చన్నది అతడెన్నడూ నేర్వలేదు. అలాంటిది... ఈ ఉప్పెన తరువాత తన జీవితంలో అంతర్వాహినిలా, ఒక ఛాయలా మిగిలిపోయిన కమల గురించిన ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అయినట్లుంది రమణారావుకి.

"చీర ఎలా ఉంది?" పుట్టిన రోజున కొత్త చీరలో కొత్తగా కొన్న నగతో తనకి పాదాభివందనం చేస్తూ అడిగినపుడు తను సొంతం తలకూడా ఎత్తకుండా ఏవో ఆఫీసు పేపర్లు చూసుకుంటూ "బాగానే ఉంది" అని పొడి పొడిగా అన్నపుడు కమల మనసులో ఏం భావాలు మెదిలి ఉంటాయి అని ఆలోచించాలంటే ఏదో గుండెల్లో కలుక్కుమన్నట్లు బాధ.

"అబ్బో! మా కమలకేం? అదృష్టవంతురాలు. ధనధాన్యాలూ భోగభాగ్యాలూనూ.. మా తమ్ముడు మంచి నిర్వాహకుడూ" ఎడాపెడా అక్క భ్రమరాంభ ఏదో ఫంక్షన్లో ఎవరితోనో అంటుంటే కమల పెదవులపై ఆ దరహాసం... అది మామూలు వాళ్ళకు తృప్తితో కూడిన అనుభవాల పరంపరలా అనిపించవచ్చునేమో కానీ.... ఇపుడు ఆలోచిస్తుంటే అందులో వేయి అర్థాలు కనిపిస్తున్నాయి. 'మాస్లో' చెప్పినట్లు జీవితావసరాల పిరమిడ్లో బేస్ స్థానంలో తిండీ, నీడా బట్టలూ మొదలైన జీవిత ప్రాథమిక అవసరాలు తీరిన తరువాత ఆ పై వరుసలో గుర్తింపు, ప్రేమ, ఆత్మగౌరవం మొదలైన మానసిక అవసరాలు మనిషికి కావాలనిపిస్తాయి. ఆ పిరమడ్లో మొదటి వరస అయిన

తిండీ, నివాసం, బట్టలూ సాధించిన వ్యక్తిని అంతటితోనే ఆగిపొమ్మంటే అతడు గుహల్లో ఆ అనాగరిక జీవితం నుంచి ఏనాటికీ విముక్తి పొంది ఉండేవాడు కాదు.

"డబ్బొక్కటే కాదుగా మనిషిని శాసించేది?" అన్న అర్థం ఆమె పెదవులపై విరిసిన దరహాసం ఎలుగెత్తి చెపుతున్నట్లనిపిస్తోంది ఇపుడు రమణారావుకి.

అవన్నీ ఆలోచిస్తుంటే తను ఇంటికి యజమానిగా మసిలేడేమో గానీ, ఇంట్లో అవసరాలకీ, పిల్లల చదువులకీ ఖర్చులకీ అమర్చే తండ్రి హోదాలో ఉండగలిగాడు గానీ, నిజంగా హృదయ బాంధవ్యం తనని ఎప్పుడైనా కట్టిపడేసిందా?

తను చెప్పిన సంబంధం కాకుండా కొడుక్కు నచ్చిన పిల్లను చేసుకున్నాడని అహం అడ్డొచ్చి కొడుకు ప్రసాద్‌తో అంటీ ముట్టనట్లు ప్రవర్తించేవాడు. పైకి కనిపించని ఒత్తిడి ఆ ఇంట వాతావరణాన్ని కమ్మేసినట్లు... ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లుండే భార్యనీ, కొడుకునీ, కోడల్నీ గమనించనట్లే ఉండేవాడు. అట్టే రోజులు భరించలేని ప్రసాద్ "అమ్మా! అమెరికాలో మంచి ఆఫర్ వచ్చింది" అంటూ తను వినేట్లు చెప్పి ఏర్పాట్లు చేసుకుంటున్నా తనేం ఉండమని మాట వరసకు కూడా అనలేదు.

కొడుకు దూరం అవగానే దిగులుగా అయిపోయిన కమల... ఓదార్పుకీ తనలో మార్పుకీ ఎదురు చూసి ఉంటుందా? ఏడేళ్ళ తర్వాత ప్రసాద్ ఇండియా వచ్చినా హైదరాబాదులో వాళ్ళ ఇంటి గృహప్రవేశం చూసి వెంటనే వచ్చేసాడు అంతే.

పిల్లలు అంటే అమితంగా అభిమానపడే కమల "మనమూ హైదరాబాదు మారిపోదామండీ" అన్నపుడు "ఏం? ఇక్కడేం తక్కువ వచ్చింది" అన్న తన జవాబు ఆ మాడ్యులేషన్ లోని తీవ్రత.. వాటిని తట్టుకోవడానికి ఎంత దుఃఖాన్ని అణిచి పెట్టుకుందో ఏమిటో?

"నాన్నా! కాఫీ తీసుకోండి" కూతురు వసంత మాటలతో ఆలోచనలలోంచి తేరుకుని కాఫీ అందుకున్నాడు.

"సింహంలాంటి మనిషి .... కమల పోగానే చాలా డీలా పడిపోయాడు" అక్కడే ఉన్న భ్రమరాంబ కళ్ళొత్తుకుంటూ అంది.

జరగవలసిన కార్యక్రమాలు అన్నీ జరిగిపోయాయి.

"గోదానం, సువర్ణదానం....అబ్బో ఏ లోటూ లేకుండా అన్నీ యధావిధిగా జరిపించాడు మా రమణ. కమల అపుడూ, ఇపుడూ, ఎప్పుడూ అదృష్టవంతురాలే" భ్రమరాంబ వచ్చిన వాళ్ళెవరితోనో అంటోంది. 'ఈ మాటలు కమల వింటే.... పగలబడి నవ్వి ఉండేదేమో!'.... బ్రాహ్మణులు హడావిడి పడుతున్నారు. తడిగుడ్డలతో... శ్రద్ధగా ప్రసాద్.... కొడుకుని గమనిస్తున్న రమణారావుకి కళ్ళలో నీటి పొర కమ్మింది.

సాయంసంధ్య వసంత ప్రసాద్‌తో అంటోంది.

"అన్నయ్యా! నాన్నని కొన్నాళ్ళపాటు నేను తీసుకువెడదామన్నా ఆడపడుచు పురిటికి అమెరికా వెళ్ళాలి నేను. ఆ అమ్మాయికి అత్తగారు లేదు. మా అత్తగారేమో లేవలేని మనిషి. ఏం చేద్దాం అంటావు?"

"నాన్నగారిని మా దగ్గరకు తీసుకు వెడతాం" అన్న వదిన సునీత వైపు ఓసారి చూసింది వసంత.

"నాకింకా ఏడాది పడుతుంది సింగపూర్ నుంచి రావటానికి. నాన్నగారు ఒప్పుకుంటే నా కంతకంటే కావల్సినదేం లేదు" అన్నాడు ప్రసాద్. పిల్లల చదువుల నిమిత్తం సునీత హైదరాబాద్‌లోనే ఉండిపోతోంది. ప్రసాద్ ఆఫీసు పనిమీద నెలలకి నెలలు విదేశాలలో ఉన్నా సరే.

ఆ మరునాడు రమణారావు దగ్గర ఈ విషయం ప్రస్తావించారు ప్రసాద్, వసంత.

అక్కడే ఉన్న భ్రమరాంబ వెంటనే "పుట్టెడు దుఃఖంలో ఉన్నావురా తమ్ముడూ! మహలక్ష్మిలా ఇంట్లో చేదోడు వాదోడుగా ఉండే కమల వెళ్ళిపోయిందా? నీకు తెలియదు కాదనకు. మనిషికి తోడు కావల్సినది దుఃఖంలోనే! నువ్వు నలుగురిలో పడితే ఆ కష్టం కాస్తయినా మరచిపోగలవు " తమ్ముడికి హితవు చెబుతూ గతంలో తమ్ముడి వివరాలు చెప్పసాగింది ఆమె.

తలా అయిదు డాలర్లు టోల్ ఫీజు కట్టాక ఒక బ్రోషర్ అందిస్తూ "చక్కగా ఎంజాయ్ చేయండి మీ ట్రిప్" అంటూ చిరునవ్వుతో చెప్పాడు కౌంటర్ వెనకనున్న అమెరికను. "చక్కగా చిరునవ్వుతో పనిచేస్తూ ఎపుడూ ఎంత ఉత్సాహంగా ఉంటారో ఈ అమెరికన్లు" అనుకుంది వసంత.

అవి తీసుకుని వసంత, ఆమె భర్త రాఘవ్, ఆమె ఆడపడుచు భర్త, ఇంకో ఇద్దరు స్నేహితులతో గ్రాండ్ కానియన్ చూసేందుకు బయలుదేరారు. 'స్వాగతం' అనే సైన్ బోర్డులు, పెట్రోల్ పంప్, రెస్టారెంట్స్, మొదలైనవి ఉండే మాప్‌లు ఎక్కడికక్కడ సూచించబడ్డాయి.

కొలరాడో నదీ లోయలో దాదాపు నూట ఎనభై అయిదు మైళ్ళ మేర విస్తరించిన ఆ గ్రాండ్ కానియన్ శిల్పాకృతులు రకరకాల ముదురు బ్రౌన్, ముదురు ఎరుపు అక్కడక్కడా నలుపు, రకరకాల వృక్షసంతతికి చెందిన మోస్‌తో ఆకుపచ్చగా సూర్యుడి గమనంతో బాటు ఎరుపు రంగులో రకరకాల ఛాయలు మార్చే ఆ అద్భుత శిల్ప సృష్టి కళాఖండాన్ని కాసేపు మైమరచిపోయి చూసారందరూ. ఆ దృశ్యంలో లీనమైపోతూ 'నేను' అన్న సంగతి మర్చిపోయిన వసంతకు అదే డీప్ మెడిటేషన్ అని తెలియకపోయినా ఆ కాస్సేపూ అద్భుతంగా అనిపించిందామెకి.

ఎవరో దేవశిల్పి తీరికగా కూర్చుని చెక్కినట్లున్న ఆ గ్రాండ్ కానియన్ రాతి వైభవాన్ని కెమెరాలో బిగించింది.

"ఎంత అందమో" వెనక్కి తిరిగి భర్తవైపు చూస్తూ అంది వసంత. అదే సమయంలో మరో ఆంధ్రా కుటుంబం అక్కడకు వచ్చారు. వాళ్ళతో పరిచయం ఊళ్ళ పేర్లు, ఇళ్ళ పేర్లు అన్నీ అయాక హఠాత్తుగా అవతల ఆవిడ "మీరు సునీతగారికి ఆడపడుచుకదూ?" అనడిగింది వసంతని.

"అవును! ఆ విషయం మీకెలా తెలుసునూ?" ఆశ్చర్యంగా అడిగింది వసంత.

"వాళ్ళ పక్కింటి మేడలో ఉంటున్నాం మేము. మిమ్మల్ని అపుడపుడూ వాళ్ళింట్లో చూసాను."

"అలాగా! మా మరిదిగారిని చూడటానికి హైదరాబాదు వస్తే ఒకమాటు వదిననీ పిల్లల్నీ చూసి వెడతాను. వాళ్ళు కులాసాగా ఉన్నారా, మా నాన్నగారు బాగున్నారా?" అని అడిగింది.

ఆవిడ తటపటాయింపుగా ఒకసారి తల తిప్పి దూరంగా మాటల్లో నిమగ్నమయిన వసంత భర్తనీ, తమవాళ్ళనీ, ఇటు దూరంగా ఫోటోలు తీసుకుంటున్న కొడుకునీ కోడలనీ.. గమనించి లోగొంతుకతో "నిజం చెబితే హర్ట్ అవుతారేమో?" అంది సంశయిస్తూ.

"ఏమిటి?" భృకుటి ముడిపడగా అడిగింది వసంత.

పక్కింటి మేడమీద ఉండే ఆవిడకు సునీత వంటిల్లు, పెరడు, లివింగ్ రూమ్ కారిడర్ అన్నీ కనిపిస్తూనే ఉంటాయి. పెరట్లో సునీత మామగారు గొప్పులు తవ్వడం, లాన్‌కి నీరు పెట్టడం, కోడలికి కూరలు తరిగి ఇవ్వడం, మిక్సీ వేయడం, కార్లో మనవడినీ మనవరాలినీ స్కూలికి దింపడం బయట నుంచి అప్పుడప్పుడు అవసరం పడితే కూరగాయలు తేవడం అన్నీ వివరంగా చెప్పింది.

"పాపం..చాలా పెద్ద ఉద్యోగం చేసి భార్యపోయిన ఈ వయసులో... ఆ పెద్ద మనిషి.." వాక్యం మధ్యలో ఆపేసి ఆవిడ వసంత రియాక్షన్ కోసం చూసింది.

ఆశ్చర్యం, కోపం నిండిన వసంత మనస్సులో సునీత మెదిలింది. తండ్రి తమ పెళ్ళినీ, తమనూ నిరసించాడని ఇలా పగతీర్చుకుంటోందా? ఆనాడు అందరిముందూ పెద్ద అభిమానం ఉన్నదానిలా "మేం తీసుకెళతాం" అని చెప్పి ఇదా నిర్వాకం? అయినా నాన్న మటుకు? అంత హోదాగా బ్రతికిన మనిషి.. పనివాళ్ళు, ఇంట్లోవాళ్ళు, బంధువులు అందరూ నాన్న అంటే ప్రత్యేకంగా గౌరవంగా

చూసేవారు! అటువంటిది? అయినా నాన్నకూడా మరునాడే పెట్టె సర్దుకుని ఇంటికి వచ్చేయక అలా పనివాడిలా దిగజారి అక్కడే ఉండటానికి కారణం? తను ఎలాగూ మరో పదిరోజులలో ఇండియాకి ప్రయాణం అవబోతున్నది. తను ఎప్పుడూ వస్తున్నదీ తెలియకుండా, ఫోన్ చేయకుండా, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి, హఠాత్తుగా వాళ్ళింటికి వెడితే సరి. సునీత మీద కోపంతో కానియన్‌లా మొహం ఎర్రబడింది వసంతకి.

టామ్ కాట్‌కి ఎమ్నీసియా వచ్చేసింది. తనెవరో మర్చిపోయి జెర్రీ మౌస్‌లా ప్రవర్తిస్తోంది. దీప్తి, కిరణ్‌తో కార్టూన్ నెట్‌వర్క్ చూస్తున్న రమణారావు.... నవ్వులతో ముందు గది అంతా నిండిపోతోంది. ఎవరూ డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చే మూడ్‌లో లేరని సునీత పిల్లలకై పాలు మామగారికి కాఫీ టిఫెన్ ముందు గదిలోకే తెచ్చి ఇచ్చి కూర్చుంది.

"ఏమ్మా? నువ్వు తెచ్చుకోలేదేం?" అని అడిగి అంతలోనే జ్ఞాపకం తెచ్చుకుని "ఇవాళ నువ్వు ఉపవాసం కదూ? " అన్నాడు రమణారావు.

వారానికి ఒకరోజు ఉపవాసం ఉండి చుట్టుపక్కల పేదవారి పిల్లలు నలుగురికి భోజనాలు వండిపెట్టే సునీత...కోడలు నియమాలు, అభిప్రాయాలూ వచ్చిన కొత్తలో విచిత్రంగా ఉండేవి రమణారావుకి.

ఆర్జించే సమర్ధవంతుడైన మగవాడి చుట్టూ సంఘం కట్టిన కంచుకోటలో క్షేమంగా ఉన్నాననుకునే తను ఇన్నాళ్ళూ అందులో బందీగా ఉన్న సంగతి నెమ్మదిగా అర్ధం అయేసరికి జీవితంలో చాలా దశాబ్దాలు గడిచిపోయాయి. చుట్టూ ఉన్న జీవితంలో ఎన్నెన్నో అందాలు, ఆనందాలు, సంతృప్తి ఉన్నాయన్న సంగతి 'నా అంతటి వాడూ లేడ'నే అహంకారంలో ఎప్పుడూ స్ఫురించలేదు. పసిపాప నిష్కల్మషమైన నవ్వుగానీ, విరబూసిన పారిజాతాలు గానీ, పడిలేచే కెరటం గానీ, నల్లని కరిమబ్బుగానీ ఎన్నడూ మనసును దరిచేరనీయకుండా జాగ్రత్తపడ్డాడు నిర్లక్ష్యంతో. ఎప్పుడూ గంభీరంగా ఉండే అలవాటు చేసుకున్న తను ఎవరి వద్దా మనస్సు విప్పలేదు. మిగతా ఎవరూ తన దగ్గర మనసు విప్పే అవకాశం ఇవ్వలేదు. అది కమల అయినా, ప్రసాద్ అయినా, వసంత అయినా సరే!

ఆ బింకం, ఆ పట్టు, ఆ అహంకారం, తనని అందరితో కలిసిపోనీయలేదు. దానివల్ల తాను పొందిన ప్రత్యేకత - తను పోగొట్టుకున్న ఎన్నో అనుభూతులూ, ఎన్నో ఆప్యాయతలూ, ఎంతో ప్రేమ ముందు - అనంత విశ్వంలో అణువంత. 'తోచకపోతే చూడండి' అంటూ కోడలు ఇచ్చిన మ్యూజిక్ వీడియో. 'ఫరెవర్ అండ్ ఆల్వేస్' లేదా 'మిధునం' కథ చదివినపుడు ఇలా కూడా ఉండచ్చు అనే సందేశం చూస్తుంటే రమణారావుకి తను ఎంత విలువైనది పోగొట్టుకున్నాడో అర్ధం కాసాగింది.

బలవంతంగా మూసేసుకున్న తన మనోద్వారాన్ని తట్టి తలుపులు తీయించి "నాన్నగారూ" అనే మధురమైన పిలుపుతో కోడలు సునీత తనదైన భావవ్యక్తీకరణలో "నువ్వు మా మనిషివే! బయటికిరా! శృంఖలాలు తెంచుకో! అందమైన జీవితంలో మనసున్న మనిషిగా జీవించు" అంటూ అంతర్గగంతా చెబుతూ తన ఆదరంలో తమ కుటుంబంలో మనిషిగా కలిపేసుకున్న కోడలి మనస్తత్వం ముందు తలవంచి ఓటమి అంగీకరించాడు.

డాక్టరేట్ పొందినా అతి సింపుల్‌గా ఉండే కోడలు, పిల్లలకు దగ్గరగా ఉండాలని ఉన్నతోద్యోగం రిజైన్ చేసి, ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా, మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్షన్ అంటూ ఇంట్లోంచీ పనిచేసే ఆమె సమయ పరిపాలన అతడికి ఆశ్చర్యం కలిగిస్తుంది.

తనని మానసికంగా దత్తత చేసుకున్న ఆ తల్లికి....... కంప్యూటర్ ముందు ఆమె పనిలో ఉన్నపుడు సహాయంగా కూరలు తరిగినా, సాయంత్రాలు మొక్కలకి నీరు పెడుతూ ప్రకృతిలో లీనం అయినా, చిన్నారి మనుమలను కబుర్లు చెపుతూ డ్రైవ్ చేస్తూ స్కూలికి దిగవిడచినా, ఏ పని చేసినా అతడికిపుడు అహం అడ్డురాదు. ఆ పని తనని మనస్ఫూర్తిగా స్వీకరించినందుకు హృదయాంజలులు అనుకుంటాడు.

గతంలో వెనక్కి తిరిగి చూసుకుంటే కమల తన మనస్సుకు దగ్గరవ్వాలని ప్రయత్నం చేసినపుడు, ఏదైనా చెప్పబోయినప్పుడూ 'టైమ్‌లేదు' అంటూ తను పట్టించుకోలేదేమో! ఇప్పుడు పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి పొందలేకపోయినా, మరోజన్మ ఎత్తిన మనసుతో కమలనూ ఆమె అభిప్రాయాలనూ గౌరవిద్దామన్నా ఆమె ప్రేమ ఆప్యాయతలూ పొందుదామన్నా 'నాకు టైం లేదు' అంటూ అతి సునాయాసంగా వెళ్ళిపోయింది.

ఈనాడు.... అదే కమల పరిస్థితిలో ఉన్నా తనని పైనుంచి ఏ దేవతలు కరుణించారో సునీత ద్వారా అందించిన ఆ అపూర్వ అవకాశం అదృష్టవంతుడిలా అందుకున్నాడు. తనని తల్లిలా క్షమించిన జీవితాన్ని అతడిపుడు ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయడు.

టాక్సీ గేటుముందు ఆగిన చప్పుడికి ఆలోచనల్లోంచి బయటికి వచ్చాడు. అందరూ గేటు వైపు చూసారు. వసంతను ఆత్మీయంగా ఆహ్వానించింది సునీత.

"కులాసాగా ఉన్నారా నాన్నా?" ఆరాగా ప్రశ్నిస్తోంది వసంత తండ్రిని ఎగాదిగా చూస్తూ. తండ్రి ముఖంలో తను ఆశించిన దైన్యం ఏదైనా తారట్లాడుతోందా అని పరిశీలనగా చూసింది.

కుశల ప్రశ్నలు టూర్ వివరాలువీటిలో రెండురోజులు గడిచాయి. తండ్రిని చూస్తే ఆశ్చర్యంగా ఉంది వసంతకు. అంత కలివిడిగా ఉండటం, పిల్లలతో అరమరికలేని కబుర్లు, నవ్వులూ, మొహమాటం లేకుండా సోఫా కవర్లు మార్చడం, తన బట్టలు తనే ఇస్త్రీ చేసుకోవడం, మార్కెట్టుకు స్వయంగా వెళ్ళి పళ్ళు, కూరలూ తేవడం ఇదంతా ఆనందంగా చేస్తున్న తండ్రిని చూస్తే ఇదంతా నిజమా?లేక తల్లిపోవడంతో  ఇక వృద్ధాప్యంలో తనని చూసేవారెవరూ ఉండరని ఇలా నటిస్తున్నారా? ఏది ఏమైనా అతనున్న స్థాయి నుంచి అంతలా దిగజారిపోవాలా? రేపొద్దున్నే నాన్నతో మాట్లాడి తనతో తీసుకుపోవడమే మంచిదని నిర్ణయానికి వచ్చింది వసంత.

ఉండమన్నా నాలుగురోజుల్లోనే వెళ్ళిపోతానన్న ఆడపడుచుకు నచ్చిన చీర కొనేందుకు బజారుకు రమ్మంది సునీత. వసంత అలాంటి ఫార్మాలటీస్ వద్దనీ తనకి తలనొప్పిగా ఉందని అంది.

"నాన్నగారు మీరు రండి. మీ సెలక్షన్ అయితే ఇంకా బాగుంటుంది" అన్న సునీత మాటలకు వెంటనే ఒప్పుకుని బయలుదేరుతున్న తండ్రిని ఆశ్చర్యపోతూ చూసింది.

అమ్మకీ, అన్నయ్యకీ, తనకీ 'పండుగలకు బట్టలు తీసుకో' అంటూ డబ్బు తల్లి చేతికిచ్చేవారు నాన్న. అంతకు మించి ఖర్చు చేయొద్దన్న హెచ్చరిక ఆ డబ్బులో ఉండేది. ఆ తరువాత ఎవరేం బట్టలు కట్టుకున్నా పెద్ద స్పందన ఉండేది కాదు అతడిలో....అలాంటిది?

అందరూ బయటకి వెళ్ళారు. చినుకులు పడుతున్నట్లు అనిపిస్తే పెరట్లో బట్టలు తెచ్చి మడత పెట్టింది. తండ్రి బట్టలు పెట్టుకునే అలమర తెరచి అందులో తండ్రి బట్టలు పెడుతూంటే ఏదో పుస్తకం జారిపడింది. ఏమిటోనని చూసింది.

'ఎన్ కౌంటర్ ది ఎన్‌లైటెన్డ్' సద్గురు జగ్గీ వాసుదేవ పుస్తకం అది.

మొదటి పేజీలో తన తండ్రి పేరు తారీకూ... ఆశ్చర్యంగా చూసింది. ఆయన ఎప్పుడూ చదివే పేపర్ ఎకనామిక్ టైమ్స్, దలాల్ స్ట్రీట్ లాంటి బిజినెస్ మేగజైన్స్ మాత్రమే! పేజీలు తిరగేస్తూంటే ఆఖరు పేజీలో తండ్రి చేతివ్రాత, తారీకూ చూసింది. ఆ తారీకు వదినగారింటికి చేరిన తరువాతదే ఆ తరువాతి నాలుగు లైన్లు అదివింది

"నిదరపోతున్న హృదయ తంత్రులకు మేల్కొలుపు రాగంలా
మృదువైన అమృత తత్వం మదినిండా నిండింది.
అనుభూతులు కూడా చొరవడని నా కోటలో
నవ వసంత జీవనం ఏదో అద్భుత భావనకు నన్ను బంధితుడ్ని చేస్తోంది
అది చాలదూ? ఈ జీవనానికి?"

తండ్రి చేతివ్రాతనీ, ఆ అక్షరాలనీ, ఆ వెనకనున్న ఆయన హృదయరాగాన్ని అధ్యయనం చేస్తూంటే..........జీవితం నాన్నని కరుణించిందా? ఇంతవరకూ అంత దైన్యంలో ఉన్నారా ఆయన? ఆశ్చర్యంగా బుగ్గన చేయి ఆనించుకుని పదే పదే ఆ వాక్యాలని చదివింది.

వాటిని తలచుకుంటూ దూరంగా కిటికీలోంచి కనిపిస్తున్న పున్నమి జాబిల్లిని చూస్తోంది. ఆలోచిస్తున్న వసంత వదినగారి పట్ల తను మనసులో పడ్డ దురభిప్రాయానికి సిగ్గుపడింది.

చీకట్లో నున్న మొలక సూర్యుడున్న దిక్కువైపే వంగుతుంది. అలా వెలుతురు ప్రసాదించిన వదినగారి సంరక్షణలో తండ్రి క్షేమంగా ఉంటారు. తండ్రిని తలుచుకుని తృప్తిగా నిట్టూర్చింది వసంత.



గత 35 సంవత్సరాలుగా కలకత్తాలో నివసిస్తున్నా తెలుగు భాష మీద మమకారం ఏమాత్రం చెదరనీని రచయిత్రి శ్రీమతి అరుణ గారు. భర్త శ్రీనివాస రావు గారు సెయిల్ లో ఛీఫ్ మార్కెటింగ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. వీరి కుమార్తె సుధ, కుమారుడు పవన్ ఇద్దరూ అమెరికాలోనే ఉంటున్నారు. తెలుగు సాహిత్యం, సంగీతాలతో బాటుగా ఫోటోగ్రఫీకూడా అరుణగారి హాబీలు.